
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 24 । ఆగస్టు । 2025



సోమశిలలో 55.816 టీఎంసీలు
జలాశయంలో శనివారానికి 55.816 టీఎంసీలు ఉన్నాయి. 21,140 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. డెల్టాకు 1850,, కండలేరుకు 9,700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,03,430
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,315
3 శాతం జీఎస్టీతో	రూ.9,594
నవర (8 గ్రా)	రూ.76,752

గరిష్టం/కనిష్టం
34.3 /28.4

వాతావరణం
జిల్లాలో ఆదివారం వాతావరణం ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. శనివారం గాలిలో తేమ 57 శాతంగా నమోదైంది.

ట్రాఫిక్ నరకం

జానా బెత్తెడు రోడ్లు.. మధ్యలో బారికేడ్లు


అసలే రద్దీగా ఉండే విజయమహల్ రోడ్డు మధ్యలో బారికేడ్లు పెట్టడంతో స్తంభించిపోతున్న ట్రాఫిక్


విజయమహల్ రోడ్డులో బారికేడ్లు పెట్టడంతో అండర్ బ్రిడ్జి మార్గంలో స్తంభించిన ట్రాఫిక్

నెల్లూరులో 'ట్రాఫిక్' ప్రజలకు నరకం చూపిస్తోంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని తీసుకుంటున్న అనాలోచిత చర్యలు బూమ్‌రాంగ్ అవుతున్నాయి. మినీబైపాస్ రోడ్డు, విజయమహల్ గేటు రోడ్డు, గేటు నుంచి పొగతోటకు వెళ్లే మార్గాలు జానాబెత్తెడుగా ఉంటాయి. ఈ మార్గాల్లోనే ట్రాఫిక్ కూడా అధికంగా ఉంటుంది. దీనికి తోడు ఆయా రోడ్లల్లో కార్లు పార్కింగ్ చేస్తున్నా.. పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నామనే బిల్డప్ కోసం సర్కిల్స్‌ల్లో డివైడర్లు, రోడ్డు మధ్యలో బారికేడ్లు పెట్టడంతో ఈ సమస్య మరింత జటిలంగా మారుతోంది. పూలే సెంటర్ పరిస్థితి చూస్తే ఒక పక్క రోడ్డు మీదనే ఆటోలను నిలిపేస్తున్నారు. మరో వైపు దుకాణాలు పెట్టి వ్యాపారాలు చేస్తున్నారు. మరో వైపు ఏకంగా కార్లు, బైక్‌లు రోడ్డు మీదకు పార్కింగ్ చేస్తున్నారు. అడ్డదిడ్డంగా దూసుకువచ్చే ఆటోలు, బైకర్లతో ప్రధాన రహదారులు ట్రాఫిక్ స్తంభించిపోయి పద్మవ్యూహాన్ని తలపిస్తున్నాయి. పూలే సెంటర్ కూడలి ఉన్నప్పటికీ డివైడర్ రాళ్లు పెట్టడంతో బాలాజీనగర్ నుంచి ఆత్మకూరు బస్టాండ్ వైపు వెళ్లాలంటే అర కి.మీ. దూరం ముందుకెళ్లి.. తిరిగి అంతే దూరం వెనక్కి రావాల్సిన దుస్థితి ఉంది. ఇక విజయమహల్ గేటు వైపు వెళ్లాలన్నా.. అదే పరిస్థితి. విజయమహల్ రోడ్డు అసలే రద్దీగా ఉంటుంది. విజయమహల్ గేటు రోడ్డు మీదకే తోపుడు బండ్లు ఉండడం, మరో వైపు దుకాణాలకు వచ్చే వాహనాలు పార్కింగ్‌తో కుచించుకుపోయింది. దీంతో ఒక కారు, ఒక బైక్ ఎదురెదురుగా కూడా వెళ్లలేని పరిస్థితి. తాజాగా రామలింగాపురం అండర్ బ్రిడ్జి వద్ద పనులు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ మొత్తం విజయమహల్ గేటు రోడ్డులోకి మళ్లింది. నిత్యం అత్యంత రద్దీగా ఉండే విజయమహల్ గేటు రోడ్డులో అండర్ బ్రిడ్జిని దాటుకుని పోయే సరికి వాహనచోదకులకు చుక్కలు కనిపిస్తున్నాయి. అసలే జానా బెత్తెడు రోడ్డులో ఇటీవల ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లు పెట్టడడంతో పూర్తిగా స్తంభించిపోతోంది. విధులు వదిలేసి కేసులు రాయడంలో బిజీబిజీగా ఉంటున్నారు. ప్రధానంగా మినీబైపాస్‌లో పూలేబొమ్మ సెంటర్, విజయమహల్ గేటు సెంటర్లలో విధులు నిర్వర్తించే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ రెండు ప్రాంతాల్లో వాహనాలు అడ్డదిడ్డంగా నడిపేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నా.. కళ్ల ముందే ట్రాఫిక్ నిలిచిపోయినా తాపీగా చూస్తున్న పరిస్థితులు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


పూలేబొమ్మ సర్కిల్‌లో డివైడర్లు ఏర్పాటు చేయడంతో అరకిలోమీటర్ ముందుకెళ్లి టర్నవుతున్న బస్సు


విజయమహల్-పొగతోట రోడ్డులో బారికేడ్లు పెట్టడంతో స్తంభించిన ట్రాఫిక్

న్యూస్‌రీల్

29న ఏటీఎస్ ప్రారంభం


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఏటీఎస్

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ముత్తుకూరు మండలం కప్పలదొరువులో ఏర్పాటు చేస్తున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్)ను ఈ నెల 29న ప్రారంభించనున్నారు. ఈ ఏటీఎస్ కేంద్రాన్ని ప్రణీత్ ఆథరైజ్డ్ టెస్టింగ్ సెంటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మాణం చేపడుతోంది. ఇది ప్రారంభమైతే జిల్లాలోని నెల్లూరుతోపాటు ఆత్మకూరు, కావలి, కందుకూరు రవాణా కార్యాలయ పరిధిలోని అన్ని రవాణా వాహనాలకు ఇక్కడే ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకుని సర్టిఫికెట్‌ను పొందాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు రవాణా వాహనాలకు జిల్లా రవాణా శాఖాధికారులే ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను జారీ చేస్తున్నారు.

కానిస్టేబుళ్ల సర్టిఫికెట్ల పరిశీలన

- 243 మందికి 235 మంది హాజరు


అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

నెల్లూరు (క్రైమ్): ఏపీ స్టేట్ లెవల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన కానిస్టేబుల్ పరీక్షల్లో ఉత్తీర్ణత పొంది ఉద్యోగం సాధించిన అభ్యర్థులకు శనివారం స్థానిక ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది. 243 మంది హాజరుకావాల్సి ఉండగా 235 మంది హాజరయ్యారు. ఎనిమిది మంది గైర్హాజరయ్యారు. సివిల్‌లో 142 మందికి 137 మంది, ఏపీఎస్పీలో 101 మందికి 98 మంది హాజరయ్యారు. వారి విద్యార్హతలు, క్రీడా సర్టిఫికెట్లు, కేటగిరీకి సంబంధించిన ధ్రువపత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన వారు భవిష్యత్‌లో క్రమశిక్షణ, నిబద్ధతతో ప్రజాసేవ చేయాని సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలనలో ఏఓ చంద్రమౌళి, సూపరింటెండెంట్ సురేష్, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల

నెల్లూరు (టౌన్): డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల చేసినట్లు డీఈఓ బాలాజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 25న మద్రాసు బస్టాండ్ సమీపంలోని వీఆర్ ఐపీఎస్ (వీఆర్ పీజీ కళాశాల) లో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ప్రారంభమవుతుందన్నారు. ఇతర వివరాల కోసం గిరీష్‌చంద్ర 7680009933, అజమ్‌తుల్లా 7075538818 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వంపై అలుపెరగని పోరాటం

- మళ్లీ జగన్‌ను సీఎం చేస్తాం
- కష్టకాలంలో తోడుగా నిలిచిన వారందరికి ధన్యవాదాలు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, జైళ్లకు పంపించినా భయపడేది లేదని, దుర్మార్గ పాలన, ఆగడాలపై అలుపెరగని పోరాటం చేస్తామని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులతో దాదాపు 86 రోజులు జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్న కాకాణికి ఇటీవల బెయిల్ మంజూరైన తర్వాత హైకోర్టు విధించిన షరతులు సడలించడంతో శనివారం నెల్లూరు నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కాకాణి విలేకరులతో మాట్లాడారు. తనకు బెయిల్ వచ్చిన తరువాత అధికారులు చార్జిషీటు ఫైల్ చేసేంత వరకు జిల్లా పరిధిలోకి రావద్దని షరతులు విధించారని, అయితే ప్రతి ఆదివారం పోలీసు కార్యాలయంలో హాజరు కావాలన్న నిబంధన ఉండడంతో హైకోర్టును ఆశ్రయించడంతో తనకు సడలింపునివ్వడంతో ఒక్క రోజు ముందుగానే నెల్లూరుకు వచ్చే అవకాశం కలిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 14 నెలల్లో తనపై 14 కేసులు పెట్టారని, నెలకు ఒక్క కేసు నమోదైందన్నారు. తర్వాత ఎన్ని అవుతాయో తెలియదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు, తన కుటుంబానికి అండగా ఉన్నారని కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు సూచించిన హెలిప్యాడ్ ప్రాంతం ప్రమాదకరమని తెలిసినా లెక్క చేయకుండా ఆ హెలిప్యాడ్‌లోనే దిగి తనను, ప్రసన్నను, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం నింపిన జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసేలా అందరం కష్టపడుతామన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఉన్న 10 సీట్లతోపాటు కందుకూరు నియోజకవర్గంతో కలిపి 11 సీట్లు రెండు పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించేలా చేస్తామన్నారు. తమను జైల్లో ఉంచిన రోజులే తమ గళం ఆపగలరు తప్ప.. బయట ఉంటే ఆ గళాన్ని ఆపలేరన్నారు. కష్టకాలంలో తన బిడ్డ పూజిత అందరికి ధైర్యంగా నిలిచిందని, ఆ బిడ్డకు అందరి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలన్నారు. కష్టకాలంలో ఉన్నటువంటి తమ కుటుంబానికి ఒక జోనల్ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని పూజితకు ఇవ్వడం తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి తమ వారికి ఇచ్చే ప్రాధాన్యతను తెలియజేస్తుందన్నారు. విశ్వాసానికి, విలువలకు ప్రతిరూపం జగన్‌మోహన్‌రెడ్డి అయితే అక్రమాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు, కార్యకర్తలకు 2029 ఎన్నికల్లో మళ్లీ జగనన్న చెప్పినట్లుగా జగన్ 2.0లో అందరం భుజాలకు ఎత్తుకుని మోయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తనకున్న ఆస్తి సర్వేపల్లి, జిల్లా ప్రజల ప్రేమాభిమానాలేనని, తనపై అక్రమ కేసులు పెట్టి జైల్లో ఉంచినప్పుడు తనకు, తన కుటుంబ సభ్యులకు జిల్లా ప్రజానీకం, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని, అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీకాంత్ నేరచరితపై విచారణ

- పలు నేరాల్లో సంబంధాలపై ఆరా

సాక్షి టాస్క్‌ఫోర్స్: జీవిత ఖైదీ శ్రీకాంత్ పెరోల్ వ్యవహారం కూటమి ప్రభుత్వానికి చుట్టుకోవడంతో దిద్దుబాటు చర్యలకు దిగింది. శ్రీకాంత్ జిల్లా కేంద్ర కారాగారం నుంచి నడిపించిన నేర చరితపై పోలీసులు లోతైన విచారణ చేపట్టారు. పలు నేరాలతో ఆయనకు సంబంధం ఉందనే ఆరోపణల నేపథ్యంలో వాస్తవాలను వెలికితీసే పనిలో పోలీసులు తలమునకలవుతున్నారు. ఆయా నేరాలకు సంబంధించిన కేసులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. నేరం ఎలా జరిగింది? ఎవరెవరి ప్రమేయం ఉంది? నిందితులతో శ్రీకాంత్‌కు ఉన్న పరిచయాలు.. ఇలా ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారు. శ్రీకాంత్ ప్రధాన అనుచరులపైనా పోలీసులు నిఘా పెట్టారు. వారిని కూడా అదుపులోకి తీసుకుని విచారించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. జిల్లా కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్న శ్రీకాంత్‌ను అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద శుక్రవారం అర్ధరాత్రి జైలు అధికారులు విశాఖ కేంద్ర కారాగారానికి తరలించారు. మరో వైపు శ్రీకాంత్ స్నేహితురాలి మోసాలపై పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. గిరిజనులను మోసగించిన ఆమెపై కోవూరు పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేశారు. ఆమె కాల్ డీటైల్స్‌ను సేకరించారు. అందులో పలువురు రౌడీషీటర్లకు ఆమె తరచూ కాల్ చేసినట్లు గుర్తించిన పోలీసు అధికారులు శనివారం వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారు ఇటీవల ఏవైనా నేరాల్లో పాల్గొన్నారా? వాటితో ఆమెకు ఏమైనా సంబంధాలున్నాయా అనే వివరాలపై ఆరా తీస్తున్నారు. ఒంగోలు కారాగార రిమాండ్‌లో ఉన్న ఆమెను పూర్తిస్థాయిలో విచారించేందుకు కోవూరు పోలీసులు పోలీసు కస్టడీ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిసింది. మరో వైపు జిల్లాలోని రౌడీషీటర్ల కదలికలపై పోలీసులు నిఘా పెంచారు. ప్రస్తుతం వారు ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారు ఇలా అన్నీ వివరాలను సేకరిస్తున్నారు. యాక్టివ్ రౌడీషీటర్లను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. వారిని విడిపించేందుకు కొందరు నేతలు ప్రయత్నించినా పోలీసు ఉన్నతాధికారులు ససేమిరా అనడంతో చేసేదేమిలేక మిన్నకుండిపోయినట్లు సమాచారం. పదే పదే నేరాలకు పాల్పడేవారిపై పోలీసు అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించినట్లు తెలిసింది.

సింహ వాహనంపై ఊరేగిన వెంకయ్యస్వామి


సింహ వాహనంపై వెంకయ్యస్వామి

వెంకటాచలం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గొలగమూడి వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం సింహవాహన సేవ నిర్వహించారు. ఆలయంలో నిత్య పూజలు అనంతరం వెంకయ్యస్వామిని సింహవాహనంపై ఆశీనులను చేసి పూలతో అలంకరించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవం ముందు వెంకయ్యస్వామి ఆశ్రమ భజన బృందం కోలాట ప్రదర్శనలు చేశారు. సింహ వాహన సేవకు వేమూరు కిషోర్‌కుమార్, నాగవెంకట అరుణలత, వెంకటసాయి సాత్విక్ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

కనుల పండువగా గరుడ వాహనసేవ

ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గరుడ వాహన సేవ నిర్వహించారు. గొలగమూడి వీధుల్లో కనుల పండుగా సాగింది. గరుడ వాహన సేవకు నెల్లూరుకు చెందిన బీవీ లక్ష్మి, హేమంత్‌రెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఉత్సవాలను ఆశ్రమ ఈఓ పి.బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

నేడు వెంకయ్యస్వామి ఆరాధనోత్సవం

భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి 43వ ఆరాధన మహోత్సవాలు ఆదివారంతో ముగియనున్నాయి. ఉదయం 10 గంటలకు రథోత్సవం జరగనుంది. రాత్రి 8 గంటలకు కోనేరులో తెప్పోత్సవం కనుల పండువగా సాగనుంది. ఆరాధనోత్సవాల్లో చివరి రోజు కావడంతో భక్తులు వేలాది సంఖ్యలో హాజరు కానుండడంతో ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఈ నెల 31 వరకే ఆజాదీ కా ఆఫర్

నెల్లూరురూరల్: బీఎస్ఎన్ఎల్ నుంచి ఒక్క రూపాయికే సిమ్, 30 రోజుల పాటు ప్రతి రోజు 2 జీబీ డేటా ఉచిత కాల్స్ పొందేందుకు ఈ నెల 31వ తేదీ చివరి తేదీ అని టెలికాం డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ జనరల్ అమరేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ప్రవేశ పెట్టిన తర్వాత మంచి స్పందన వచ్చిందని తెలిపారు. ఇతర టెలికం ఆపరేటర్ల కన్నా తక్కువ ఖర్చుతో సేవలు వినియోగించుకోవచ్చని తెలిపారు. డేటా స్పీడ్ పెంచి ఇస్తున్నామని, తమ 4జీ సేవలకు ఇతర ఆపరేటర్లు ఇస్తున్న 5జీ సేవలకు పెద్ద వ్యత్యాసం లేదని తెలిపారు. దగ్గర్లో ఉన్న బీఎస్ఎన్ఎల్ సేవా కేంద్రం లేదా రిటైలర్లను సంప్రదించాలని కోరారు.

డీఎస్సీలో మూడు పోస్టులకు అర్హత


పులిమి శ్రీతేజ

ఉదయగిరి : డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో ఉదయగిరి మండలం సున్నంవారిచింతల గ్రామానికి చెందిన పులిమి శ్రీతేజ మూడు ఉద్యోగాలు సాధించింది. ఈమె ఎస్ఏ సోషల్ సబ్జెక్ట్‌లో జిల్లా స్థాయిలో 82.11 మార్కులు సాధించి 4వ ర్యాంక్‌లో, టీజీటీ జోనల్- 3 స్థాయిలో 73.20 మార్కులు సాధించి 17వ ర్యాంక్, ఎస్‌జీటీ చిత్తూరు జిల్లాలో నాన్ లోకల్‌లో 86.92 మార్కులతో 33వ ర్యాంక్ సాధించి తన ప్రతిభ చాటారు.

- ఉదయగిరికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు షేక్ నస్రుల్లా ఇంగ్లిష్ ఎస్ఏ సబ్జెక్ట్‌లో 57వ ర్యాంక్, షేక్ సిగ్బతుల్లా జోన్-3 పీఈటీ విభాగంలో 1వ ర్యాంక్, జనరల్ కేటగిరీలో 179వ ర్యాంకులు సాధించి ఉద్యోగం తెచ్చుకున్నారు.

బంగారు హారం బహూకరణ



సంగం: సంగం ఆంజనేయస్వామి ఆలయానికి ఓ దాత సుమారు రూ.6 లక్షల విలువైన బంగారు హారాన్ని శనివారం బహూకరించారు. ముందుగా స్వామి వారికి విశేష పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హారాన్ని సమర్పించారు. స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

డీఎస్సీ ఫలితాలు విడుదల

- డీఎస్సీ, డీఈఓ వెబ్‌సైట్లలో ఫలితాలు
- అభ్యర్థులకు కాల్ లెటర్
- రేపు మెరిట్, రోస్టర్ ప్రకారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నెల్లూరు (టౌన్): ఎట్టకేలకు డీఎస్సీ ఫలితాలు శుక్రవారం రాత్రి విడుదలయ్యాయి. నాలుగు రోజులుగా ఏ రోజుకారోజు ఫలితాలు విడుదల చేస్తున్నట్లు అధికారులు ప్రకటిస్తుండటంతో అభ్యర్థులు ఉత్కంఠతతో ఎదురు చూశారు. మెగా డీఎస్సీ, జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్లలో ఫలితాలు అందుబాటులో ఉంచారు. టెట్ రెండు సార్లు జరిగింది. ఈ ఏడాది జూన్ 6 నుంచి జులై 2వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షను నిర్వహించారు. జిల్లాలో 673 పోస్టులకు 31,164 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 29,109 మంది హాజరయ్యారు. డీఎస్సీలోని పలు సబ్జెక్ట్‌ల్లో అభ్యర్థులు తమ సత్తా చాటారు. మార్కులు, రోస్టర్ కం రిజర్వేషన్ ఆధారంగా సోమవారం అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలవనున్నారు. పీఈటీ, పీజీటీ, ఫిజికల్ డైరెక్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు సంబంధించి ఫలితాలను విడుదల చేశారు.

ఒకే డీఎస్సీలో మూడు పోస్టులు

స్కూల్ అసిస్టెంట్ విభాగంలో మూడో ర్యాంక్


తిరుమూరు స్వప్న

పొదలకూరు : మండలంలోని బి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన తిరుమూరు స్వప్న 2025 డీఎస్సీ పోటీ పరీక్షల్లో ఒకే పర్యాయం మూడు పోస్టులను సాధించి తన ప్రతిభను కనపరిచారు. స్కూల్ అసిస్టెంట్ హిందీలో జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు, పీజీటీలో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు, టీజీటీలో జిల్లా స్థాయిలో ఐదో ర్యాంకు సాధించారు. 2018లో డీఎస్సీలో అర్హత సాధించలేకపోయిన స్వప్న 2025 డీఎస్సీలో మూడు పోస్టులను సాధించడంతోపాటు ర్యాంకర్‌గా నిలిచారు. పట్టుదల, కృషితో ఆమె ఈ విజయాన్ని అందుకున్నారు.

జిల్లాలో ఆయా విభాగాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారు

➡ స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజ్ ఇంగ్లిష్)	
జి. మోహన్‌వెంకటసతీష్	: 88.13
ఎ లక్ష్మీస్వరూప	: 85.83,
ఎం.బాబు	: 84.77
➡ స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజ్, హిందీ)	
సయ్యద్ షబనాజ్	: 84.65
లంకసింధు	: 79.68
తిరుమూరు స్వప్న	: 76.77
➡ స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజ్ తెలుగు)	
ఎం.పెంచలయ్య	: 90.156
సీహెచ్ సుధామణి	: 86.602
ఎం.ప్రదీప్	: 84.638
➡ స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజ్ ఉర్దూ)	
షేక్ ఫయాజుద్దీన్	: 86.33
షేక్ షనీర్	: 75.17
షేక్ అజీముద్దీన్	: 75.03
➡ స్కూల్ అసిస్టెంట్ (బయాలజికల్ సైన్స్)	
సీహెచ్ వెంకటరెడ్డి	: 85.361
జి.ప్రణీత	: 84.868
బి.లక్ష్మీ ప్రసన్న	: 83.690
➡ స్కూల్ అసిస్టెంట్ (మ్యాథమ్యాటిక్స్)	
డి. నాగసాయి శరత్ ఫణీంద్ర	: 84.304
టి.హనుమంతురావు	: 83.312
బి.భార్గవి	: 83.175
➡ స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)	
ఆర్ సాయికోటి	: 93
టి.హరిప్రసాద్	: 89
టి.వెంకటేశ్వర్లు	: 58
➡ స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)	
ఎల్.వినయ్‌కుమార్	: 87.87
పి.సుధాకర్	: 83.03
టి. భాస్కరరావు	: 78.77
➡ స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్)	
ఎం.బాబు	: 85.02
చీలీ శ్రావణి	: 82.68
పి.శిరీషా	: 82.47
➡ సెకండరీ గ్రేడ్ టీచర్లు	
షేక్ నయాబ్ రసూల్	: 94.51
కె.దినేష్	: 94.41
జె.వనజ	: 93.31
➡ ఎస్జీటీ (ఉర్దూ)	
సయ్యద్ రిజ్వాన్ అలీషర్	: 57.77
ఎన్.గాయిత్రీ	: 50.77
సయ్యద్ ఖాజా ఖాదీముల్లా	: 50.47

క్లుప్తంగా

ఆంధ్రకేసరి జీవితం ఆదర్శనీయం

• ఎస్పీ కృష్ణకాంత్



నెల్లూరు(క్రైమ్): నిజాయితీకి మారుపేరైన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శనీయమని ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు శనివారం జరిగాయి. తొలుత ప్రకాశం పంతులు చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణయాత్మక పాత్ర పోషించారన్నారు. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా విశేష సేవలందించారని తెలిపారు. తెలుగువారు గర్వించదగిన మహనీయులు ప్రకాశం పంతులన్నారు. ఆయన త్యాగనిరతి, దేశభక్తి, నిరాడంబరత, ప్రజా సంక్షేమ దృష్టిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

బీవీనగర్‌లో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన బీవీ నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్‌లో మహేష్ కుమార్ నివాసం ఉంటున్నారు. ఆయన ఈనెల 21వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని 11 గ్రాముల బంగారు కమ్మలు, వెండి లక్ష్మీదేవిబొమ్మను అపహరించుకుని వెళ్లారు. శనివారం ఇంటికి వచ్చిన మహేష్ కుమార్ చోరీ ఘటనపై వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువు.. మరింత బరువు

• యూరియా కొరత సాకుతో అదనపు వసూలు • ఆందోళనలో అన్నదాతలు

కూటమి ప్రభుత్వంలో అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది. పెరిగిన సాగు ఖర్చులకు తోడు ఎరువుల ధరలు కూడా అమాంతం పెరిగిపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. యూరియా కొరత పేరుతో వ్యాపారులు ఎరువుల ధరలు పెంచి రైతులపై మరింత భారం మోపుతున్నారు. పంటలకు ప్రధానంగా అవసరమైన కాంప్లెక్స్ ఎరువుల ధరలు ప్రతి ఏడాది క్రమేణా పెరుగుతుండడం అన్నదాతలపై అదనపు భారంగా మారింది.

– ఉదయగిరి



సాగులో ఉన్న వరి

ప్రైవేటు డీలర్ల దందా

ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న వివిధ పైర్లకు యూరియాతో పాటు పలు రకాల కాంప్లెక్స్ ఎరువులు వేస్తున్నారు. కానీ రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు డీలర్లను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు వ్యాపారులు యూరియా కావాలంటే ఇతర కాంప్లెక్స్ ఎరువులు, కాల్షియం, పొటాషియం, నానో డీఏపీ, నానో యూరియా కొనాలంటూ షరతులు పెడుతున్నారు. అలాగే జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో డీఏపీ ఎరువుకు కూడా అదనపు వసూలు చేస్తున్నారు. వీటిపై ప్రశ్నిస్తే యూరియా, డీఏపీ సరఫరా చేసే డిస్ట్రిబ్యూటర్లు నిబంధనలు పెడుతూ అదనంగా ఇతర ఎరువులు తమకు అంటగడుతున్నారని డీలర్లు వాపోతున్నారు. దీంతో డిమాండ్ ఉన్న ఎరువులను ధరలు పెంచి అమ్మాల్సి వస్తోందని, లేదా ఇతర రకాల ఎరువులు కొనాలి అని షరతులు పెడుతున్న మాట వాస్తవమే అని కొందరు వ్యాపారులు ఒప్పుకుంటున్నారు.

పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు

ప్రస్తుతం జిల్లాలో వరితో పాటు మిరప, బొప్పాయి, అరటి, ఇతర ఉద్యాన వన తోటలు సాగులో ఉన్నాయి. మెట్ట ప్రాంతంలో కూడా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కంది, అలసంద, మినుము తదితర అపరాల సాగు చేస్తున్నారు. ఈ పైర్ల సాగు కోసం యూరియా డీఏపీ ఎక్కువగా వాడుతున్నారు. దీనికి తోడు జిల్లాలో విస్తారంగా సాగులో ఉన్న జామాయిల్‌కు ధర తక్కువగా ఉన్నందున యూరియా వాడుతున్నారు. కానీ వ్యవసాయాధికారులు జామాయిల్ సాగు చేసే రైతులకు యూరియా ఇవ్వడం లేదని, వారు కాంప్లెక్స్ ఎరువులు మాత్రమే వాడాలని చెబుతున్నా అమలు కావడం లేదు. డీఏపీ కొంతమేర అందుబాటులో ఉంది. అయితే ప్రైవేటు డీలర్లు అదనపు ధర వసూలు చేస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలు ఎక్కువగా ఉండటంతో సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీనికి అనుగుణంగా దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడంతో నష్టాలు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పచ్చిరొట్ట ఎరువులు విస్తారంగా సాగు చేసి భూమిలో కలియదున్నితే చాలా వరకు రసాయన ఎరువుల వినియోగం తగ్గించే అవకాశం ఉంది. కానీ పచ్చిరొట్టగా సాగు చేసే పిల్లి పెసర, జనుము, జీలగలు ప్రభుత్వం రాయితీపై నామమాత్రంగా సరఫరా చేసింది. దీంతో చాలా మంది రైతులు బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ ధరలు చెల్లించి పచ్చిరొట్ట విత్తనాలను కొనుగోలు చేయలేకపోతున్నారు. ఫలితంగా పైరు సాగు చేసినప్పటి నుంచి కోత వరకు రసాయన ఎరువుల వినియోగంపై ఆధారపడుతున్నారు. దీంతో ఎరువుల వినియోగం పెరిగి రైతులపై భారం పడుతోంది.

ఏడాది కాలంలో పెరిగిన ధరలు

ఎరువు రకం	గతేడాది ధర	ప్రస్తుత ధర
20:20:0:13	రూ.1,300	రూ.1,400
10:26:26	రూ.1,470	రూ.1,800
14:35:14	రూ.1,700	రూ.1,800
పొటాష్	రూ.1,535	రూ.1,900
సింగిల్ సూపర్ పాస్పేట్	రూ.580	రూ.640



ఎరువులు చల్లుతున్న రైతు

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో చోరీకి పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ఓ దొంగను నవాబుపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్‌రెడ్డి నిందితుడి వివరాలను వెల్లడించారు. వెంకటేశ్వరపురం రైలువీధిలో సయ్యద్ షబ్బీర్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన ఈనెల 20వ తేదీన కుటుంబంతో కలిసి ఉదయగిరిలో గంధ మహోత్సవ కార్యక్రమానికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగుడు ఆయన ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని పది సవర్ల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితుడు అదే ప్రాంతానికి చెందిన అరవ సుబ్రహ్మణ్యంగా గుర్తించారు. పరారీలో ఉన్న నిందితుడిని శనివారం అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వ్యసనాలకు బానిసైన నిందితుడు దొంగతనాలకు పాల్పడుతున్నాడని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనపరిచిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఎస్సై కె.భోజ్యానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ క్యాబిన్ దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వెంకటాచలం: లారీలో మంటలు చెలరేగి క్యాబిన్ దగ్ధమైన ఘటన వెంకటాచలం సమీపంలో ఆర్టీసీ జోనల్ కళాశాల వద్ద శనివారం జరిగింది. నెల్లూరు వైపు నుంచి చెన్నై వైపు ఐరన్ లోడ్‌తో వెళ్తున్న లారీని ఆర్టీసీ జోనల్ కళాశాల వద్ద డ్రైవర్ నిలిపి వంట పనుల్లో నిమగ్నమయ్యాడు. అయితే లారీ క్యాబిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగింది. వెంటనే డ్రైవర్ అప్రమత్తమై టోల్ ప్లాజా సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే ఫైర్ ఇంజిన్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు లారీ మొత్తం వ్యాపించకుండా అదుపుచేశారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



ఫుట్‌బాల్ ఆడుతున్న ప్లేయర్లు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ పోటీలను శనివారం ప్రారంభించారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారుడు, బరోడా బ్యాంకు రిటైర్డ్ జీఎం అనిల్‌కుమార్ పోటీలను ప్రారంభించారు. సీనియర్ క్రీడాకారులు ప్రతాప్, చిట్టి, చలపతి, సురేష్, సీనియర్ ఫుట్‌బాల్ ప్లేయర్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మలిరెడ్డి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు ఫలితాలు

వైఎస్సార్ కడప జట్టుపై అనంతపురం జట్టు 2-1 గోల్స్‌తో గెలుపొందగా, ఎన్టీఆర్ జిల్లా- వైఎస్సార్ జిల్లాపై 5-0 గోల్స్‌తో, నెల్లూరు జిల్లా జట్టు -ఎన్టీఆర్ జిల్లాపై 2-0 గోల్స్‌తో, అనంతపురం జట్టు -పల్నాడుపై 10-0 గోల్స్‌తో, నెల్లూరు-వైఎస్సార్ జిల్లాపై 5-0 గోల్స్‌తో, వైఎస్సార్ కడప-పల్నాడు జిల్లా జట్టుపై 7-0 గోల్స్‌తో విజయం సాధించాయి. ఆదివారం ఉదయం సెమీఫైనల్స్, మధ్యాహ్నం ఫైనల్స్, బహుమతు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.చంద్రశేఖర్ తెలిపారు.

సంపూర్ణ అక్షరాస్యతకు కృషి



మాట్లాడుతున్న అక్షరాంధ్ర నోడల్ అధికారి మస్తాన్‌రెడ్డి

కొడవలూరు: సంపూర్ణ అక్షరాస్యతకు కృషి చేద్దామని అక్షరాంధ్ర జిల్లా నోడల్ అధికారి మస్తాన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కొడవలూరు జెడ్పీ హైస్కూల్లో అక్షరాస్యత వలంటీర్లకు శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గాన్ని సంపూర్ణ అక్షరాస్యతతో తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గ్రామస్థాయిలోని అక్షరాస్యత వలంటీర్లు సాయంత్రం రెండు గంటల సమయం కేటాయించి చదువు చెప్పాలన్నారు. ప్రజలు వేలిముద్రలు వేయకుండా చదువు నేర్చుకుని చైతన్యవంతులుగా ఉండాలని ఆకాంక్షించారు. ఎంపీడీఓ ఎ.వెంకట సుబ్బారావు మాట్లాడుతూ మండలాన్ని వంద శాతం అక్షరాస్యతగా తీర్చిదిద్దుదామని కోరారు. కార్యక్రమంలో అక్షరాంధ్ర సూపర్‌వైజర్ శిరీష, ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎన్.అంకయ్య, ఏపీఎం కృష్ణవేణి, హెచ్‌ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

లోపాలు తలెత్తితే చర్యలు తప్పవు

• 38.4 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు
• ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడం మనందరి బాధ్యత అని, ఎక్కడైనా లోపాలు తలెత్తితే చర్యలు తప్పవని ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) గురవయ్య అన్నారు. నగరంలోని విద్యుత్‌భవన్‌లో శనివారం ఆయన టౌన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా విద్యుత్ సంస్థలోని అన్ని విభాగాల సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై వచ్చిన ఫిర్యాదులు, లో–ఓల్టేజీ సమస్య, విద్యుత్ ఫీడర్స్‌లో తరచూ తలెత్తే అంతరాయాలకు సంబంధించిన గణాంకాలు తన వద్ద ఉన్నాయని, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్ అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ విద్యుత్ లైన్ల లోపాలు ముందుగా గుర్తించి పునరుద్ధరణ చేపట్టాలని, ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఫోన్లకు వచ్చే ఫిర్యాదులను నమోదు చేసి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది హెడ్ క్వాటర్స్‌లోనే ఉండాలని, పీఎం సూర్యఘర్‌పై అవగాహన కలిగించాలని, పెండింగ్ బిల్లులను త్వరితగతిన వసూలు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో తలెత్తిన సమస్యలపై 1912, వాట్సాప్ నంబర్ 91333 31912లకు ఫిర్యాదు చేయాలని కోరారు.

పలు సబ్‌స్టేషన్ల తనిఖీ

నగరంలోని డీఎస్సార్ సబ్‌స్టేషన్, కోవూరు తాలూకా ఆఫీసు వద్ద ఉన్న సబ్‌స్టేషన్‌లను ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం కోవూరు డివిజన్ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిరంతర విద్యుత్ సరఫరాపై 38.4 శాతం మంది వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు మంచి సేవలు అందేలా అధికారులు, సిబ్బంది పని చేయాలని సూచించారు. అధికారులు తరచూ సబ్‌స్టేషన్లను తనిఖీ చేస్తూ ఉండాలని ఆదేశించారు. విద్యుత్ చౌర్యం, అడిషనల్ లోడ్‌లను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో తరచూ ఫెయిల్ అవుతున్నాయని మండిపడ్డారు. అనంతరం సబ్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌ఈ విజయన్, నోడల్ అధికారి శేషాద్రి బాలచంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీధర్, రమేష్‌చౌదరి, డీఈఈలు అశోక్, సునీల్, కిరణ్, మధుసూదన్‌రెడ్డి, సతీష్, సురేంద్ర, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ



ఊంజల్‌సేవకు స్వామి అమ్మవార్లను తీసుకొస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో కొలువైన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీదేవి సమేత పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి ఊంజల్‌సేవ శనివారం సాయంత్రం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను అలంకార మండపంలోకి తీసుకొచ్చి అక్కడ తిరుచ్చిపై కొలువుదీర్చారు. ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం సహస్రదీపాలంకరణ మండపంలో ఊంజల్‌సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం నిత్య కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం ఆగమోక్తంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



నెల్లూరు(క్రైమ్): ఏం కష్టమొచ్చిందో తెలియదు కానీ రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన విజయమహల్ గేటు సమీపంలో నెల్లూరు వైపు వచ్చే రైలు పట్టాలపై శనివారం చోటుచేసుకుంది. మృతుడు సుమారు 45 నుంచి 50 ఏళ్లలోపు వయస్సు కలిగి లేత పసుపురంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్	: రూ.105
లేయర్	: రూ.118
బ్రాయిలర్ చికెన్	: రూ.196
స్కిన్‌లెస్ చికెన్	: రూ.216
లేయర్ చికెన్	: రూ.200

పొదలకూరు నిమ్మ ధరలు(కిలో)

పెద్దవి	: రూ.30
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.10

కండలేరులో 31 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 31.092 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8,330 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,400, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలియజేశారు.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి

AUTOMOBILES

VEHICLE FOR SALE

■ Tata Motors Dealer Test Drive Vehicles for Sale: Petrol, CNG & Diesel. Available Models - Altroz, Punch, Nexon, Curvv, Harrier & Safari :: Electric Vehicles: Tigor EV, Punch EV, Nexon EV.Special Discount Price starts from Rs.7.5 Lakhs onwards. T&C Apply. For Details: Varalakshmi Automobiles Pvt Ltd.Cell: 7337559091. [NA-163]

REAL ESTATE

■ స్పాట్ క్యాష్‌తో కనుపర్తిపాడు, పడారుపల్లి కొండాయపాలెం, కల్లూరుపల్లి, బి.బి.నెల్లూరు, కాకుటూరు, BV.నగర్ ఏరియాలలో అన్ని లే అవుట్ల నందు ప్లాట్‌లు కొన॥ 9849489529 [NA-7079]

FLAT FOR SALE

■ NELLORE KAC APARTMENT 207,1850sft 3BHK West face for sale opposite narayanconcept school, cont 9848995798. [SCA25007340]

■ 2BHK నార్త్, ఈస్ట్ ఫేసింగ్ ఉడ్‌వర్క్ కల్గిన ఫ్లాట్, 2nd ఫ్లోర్‌లో అమ్మకమునకు కలదు. ధర కేవలం 36 లక్షలు మాత్రమే. లొకేషన్ : తడ, సంప్ర॥ 9493550999 [NA-24348]

■ నెల్లూరు, B.V. Nagar, DRK Jewel Rocks నందు 3BHK / 2BHK Flats for sale. Ready to occupy. Cont : 98490 24346, 90300 44271, 98660 17066. [NA-24304]

■ నెల్లూరు, B.V. Nagar, Sangamitra Homes నందు 2BHK Flats for sale. Ready to occupy. Cont : 90527 57107, 94933 09777, 92472 56585. [NA-24305]

■ RTC బస్టాండ్ దగ్గర, అరవిందనగర్, స్ప్రింగ్ నెస్ట్ అపార్ట్‌మెంట్‌లో 1650 చ॥అ॥ల, లాస్ట్ ఒక 3 BHK FLAT అమ్మకానికి కలదు.ఫోన్ : 96770 10777 [V-2850]

■ బాలాజీనగర్‌లో 1939 Sft. 3BHK ఇస్కాన్ టెంపుల్ దగ్గర 1875 Sft. 3BHK బాబానగర్ లో 1260 Sft. 2BHK సరస్వతి నగర్‌లో 1350 Sft. 2BHK. ఫ్లాట్స్ అమ్మబడును. సం ॥ 8309097135. [SCA25006699]

FOR SALE

■ BSNL POSTAL HOUSING SOCIETY Residential and Commercial Sites near Bengaluru International Airport. Rs:1400/- per sqft Bang on 8 Lane (330 feet Ring road) Booking Open for General public Call: 90715 34000 [QA-2295]

PLOT FOR SALE

■ Plot for sale at Rao's college area Bujjabuja Nellore & Kottur TML Nagar, Nellore NMC. Cont : 94924 65627 [NA-5587]

■ 30 Ankhanam Plot for Sale in NUDA approved Layout for only 13.5 Lakhs. No mediators. Call : 99638 66099. [NA-7074]

■ నరుకూరు సెంటర్లో DTCP Approved ప్లాట్స్ అంకణం 70 వేలు, Nuda Approved ప్లాట్స్ 80 వేలు, లోను సౌకర్యం కలదు. సంప్ర॥ 62814 11178, 91214 52347. [NA-7092]

ప్రకటన గోరంత స్పందన కొండంత

CHANGE OF NAME

We, NELAVALLI HARI PRASAD S/o. NELAVALLI SUDHAKAR & SUHARSHA VARDHINI CHITTINENI, W/O. NELAVALLI HARI PRASAD, we informed that my son Name was RUTHICK NELAVALLI (Old name), Resident of Check post, Chavali Village,Pellakuru Mandal, Tirupati Dt, AP. Here by declare that we have changed my son name as TEJO VARDHAN NELAVALLI (New name).

■ ధనలక్ష్మీపురం, కలివెలపాలెం రోడ్డు, Sai Avenue Layoutలో 25 అంకణముల (30×60) North Fash Face ప్లాట్ అమ్మబడును. సంప్ర॥ 93955 94333, 93926 95940. [NA-24368]

■ ఆత్మకూరు కూరగాయల మార్కెట్ కు వెళ్ళు దారిలో గవర్నమెంట్ హాస్పిటల్ ప్రహరీ గోడకు ఎదురు కమర్షియల్ షాపుల కొరకు 10 అం॥ల స్థలం అమ్మ॥ సెల్: 94404 95864. [NA-7094]

■ నెల్లూరు టౌన్-హరినాథపురంలో మసీదుకు ఎదురు రోడ్డులో, రిలయన్స్ టవరుకు ఎదురుగా ఉండే ఫిజియో థెరపీ హాస్పిటల్ ఉండే స్థలము (75అం॥)అమ్మకం.7672000200, 7671000100 [HA-429]

■ వరసిద్ధినగర్ నందు ప్లాట్లు అమ్మబడును. నెల్లూరు మూలాపేట ఇరుకళల పరమేశ్వరి టెంపుల్ నుంచి 5కి.మీ లలో(జొన్నవాడ రూటు) 35అం॥ల ప్లాట్లు ఓప్డీ తూర్పు ఫేస్ ప్లాట్లు అమ్మబడును. సంప్ర: 95734 75039, 95153 51316. [NA-187]

RENT / LEASE

■ గోడౌన్ (Godown) లీజుకు కలదు హరనాథపురం, NH16కి దగ్గరలో 3600 Sqft. ఏ రకమైన వస్తువులు భద్రపరుచుటకు బాడుగకు ఇవ్వబడును. 98489 20567, 94909 59859 [NA-24366]

RE-WANTED

■ 3BHK (2nd Sales) Flat Requires in & Around nellore Town For Purchase Spot Registration Owners Only Contact: 9440583423. [NA-909]

SERVICES

■ బుజ్జీస్ బ్యూటీపార్లర్, Opp. సండేమార్కెట్ పొగతోట, నూతన విధానాలతో స్పెషల్ ట్రీట్‌మెంట్ కలదు. బ్రైడల్ మేకప్, హెయిర్ స్టైల్ మా ప్రత్యేకత. సంప్రదించండి: 2347011. [NA-5574]

■ హోమ్‌కేర్ ప్రొడక్ట్స్, డిటర్జెంట్ లిక్విడ్, Agarbathi, Dhoop, Cones, Room Spray ఆల్ క్లీనింగ్ ఐటమ్స్ దొరుకును. బి.వి. నగర్, నెల్లూరు. శ్రీ కెమికల్స్. సెల్ : 9030587285 [NA-7089]

GOLD FINANCE

■ MVS Gold బ్యాంకులలో, ప్రైవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని విడిపించి కొనబడును. Opp. సాయిబాబా గుడి, వేదాయపాళెం, Nlr. 9346332303, 9281458813. [NA-11349]

WANTED

■ Wanted Telugu Subject hostel Teacher from 7th to 10th classes accomodation available. contat : 99499 88564. [NA-11352]

■ Wanted Physics Teacher for higher classes, English Teacher for lower classes & spoken English Teacher to work at NLR. 8185006373, 88973 57015 [NA-7087]

■ Wanted teachers to teach play class. English fluency must. To work in Podalakur Road, Nellore. Contact : 94930 30638. [NA-2911]

■ Lawyer Attention: Need Lawyer for EP proceedings (Money suit won) Contact: 8074838188 [WB-19248]

CHANGE OF NAME

I, SINDHUJA (Old Name) W/o BANDLA SATISH NAIDU Resident of Flat No. 301, Trishul Apartment, Iscon city, 2nd Cross Road, 2nd Right, near Iscon Temple, Vanamthopu, Nellore-524004, SPSR NELLORE Dt., A.P. hereby declare that I have changed my Name as BANDLA SINDHUJA (New Name), W/o BANDLA SATISH NAIDU.

■ Wanted IIT Maths Teacher, Communicative English Teacher, Maths correction Teacher, Telugu & Hindi Foundation Teacher, Lady Dance Teacher to work in a School at NLR-4. 8374749678 [NA-7096]

■ Advertising ఏజెన్సీ నందు Canva డిజైనర్(F), మార్కెటింగ్ Exe, Telecaller (F), Qlf:Any Degree + Comp. Knowledge. Cont : Nlr. 9014003006, 9160200300 [NA-3072]

■ నెల్లూరులోని ప్రముఖ కార్పొరేట్ హాస్పిటల్స్ లో 10th విద్యార్హత గల సెక్యూరిటీ గార్డులు (M/F) కావలెను. జీతం : 17,000. సెల్ : 8985011766, 9666994954. [NA-7093]

■ అంజనా ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ రియల్ ఎస్టేట్ కంపెనీ నందు పని చేయుటకు అనుభవం కలిగిన టెలికాలర్లు మరియు మార్కెటింగ్ మేనేజర్లు కావలెను. సంప్ర॥ 8978978936 [NA-24365]

■ Personal Loans ఆఫీస్ నందు Executive కావలెను. No targets, Two wheeler must, Quf - Inter, Age & below 25, Nellore Local candidates. Sal - 15000/-. 8885802000. [NA-24363]

■ ఇంటిలో వెజ్, నాన్‌వెజ్ వంట మరియు క్లీనింగ్ (12000-15000) చేసేదానికి అను భవం ఉన్న 30 సం॥ లోపల వయస్సు ఉండే లేడీస్ కావలెను. 9392695940, 9398644232. [NA-24340]

■ టెక్కెమిట్ట ప్రాంతంలో రోజు 2గంటలు బాత్‌రూం క్లీనింగ్ చేసే దానికి 30సం॥లోపల వయస్సు ఉండే లేడీస్ కావలెను.జీతం .8000/- సంప్ర: 93926 95940, 9398644232. [NA-24316]

■ నెల్లూరు సంతపేటలోని పెయింట్స్ షాపులో పని చేయుటకు సేల్స్‌బాయ్ కావలెను. విద్యార్హత : 10th ఆకర్షణీయ జీతం. సంప్ర: 99898 50416. [NA-184]

■ మా ఇండస్ట్రీలో పనిచేయుటకు అకౌంట్స్ తెలిసిన, కంప్యూటర్ నాలెడ్జి గల ఆఫీసు అసిస్టెంట్ (Male) కావలెను. మంచి జీతం ఇవ్వబడును. సంప్ర: 99493 29944. [NA-185]

■ నెల్లూరు లో AP Juice Point నందు work చేయుటకు బాయ్స్ & గర్ల్స్ కావలెను. జీతం : 10,000 to 15,000. వివరాలకు సంప్రదించండి. సెల్ : 75695 72169. [NA-7095]

■ నెల్లూరు రైల్వేఫీడర్స్ రోడ్డులోని ప్రముఖ ఆక్వా కంపెనీలో పనిచేయుటకు ఆఫీస్ హెల్పర్స్ కావలెను. (M/F). వివరాలకు సంప్రదించండి. సెల్ : 97032 27878. [NA-7097]

■ మా హాస్పిటల్ నందు M/F అసిస్టెంట్స్ కావలెను. శ్రీకృష్ణా ఆయుర్వేదిక్ హాస్పిటల్, RTC వెనుక వైపు, 2వ వీధి, నెల్లూరు. 91002 95397. [SCA25007525]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406 [HA-16129]

■ నెల్లూరులో ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీకి మేనేజర్‌గా పని చేయుటకు లేడీ పోస్ట్ గ్రాడ్యుయేట్ అవసరం. ఇంటర్వ్యూ తేదీలు:25 ఆగష్టు. Contact: 9676048905 [HA-33]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్. జీ : 18K. Ph: 9640400073, 9160900024 [SCA25007487]

■ నెల్లూరు టౌన్‌లో ఇంట్లోనే ఉండి వంటపని చేయుటకు వంట మనిషి (ఆడ మనిషి) వెంటనే కావలెను. సంప్ర: ఫోన్: 7661000100, 7661000200 [HA-428]

■ నెల్లూరు, హరనాథపురం మెయిన్ రోడ్‌లో AMR HP పెట్రోల్ బంకు నందు డే & నైట్ షిఫ్ట్‌లో పని చేయుటకు అబ్బాయిలు, అమ్మాయిలు. జీతం : 13,000 – 15,000. సంప్ర॥ 89852 64143, 94947 97343. [NA-7091]

■ సూళ్ళూరుపేట లో ప్రముఖ కాఫీ పరిశ్రమకు 19-40 సం॥ మధ్య గల ప్యాకింగ్ బాయ్స్, గార్డెన్ వర్కర్స్ కావలెను. రూమ్, క్యాంటీన్ సౌకర్యం కలదు.✆ 9298011777/7093924466 [SCA25007472]

■ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, నెల్లూరు జిల్లాలో పని చేయుటకు MBA / డిగ్రీ అర్హత కలిగిన 29సం॥ గల యువకులు కావలెను. జీతం: 17000 + ఇన్సెంటివ్ + టూ వీలర్ మస్ట్. Venkatasureshbabu.r@shriramfinance.me. సంప్రదించండి: 8008802378, 90105 32923. [NA-1887]

■ ప్రముఖ Brewary & రెస్టారెంట్ నందు పని చేయుటకు, accountants.. మేనేజర్లు.. బార్ టెండర్లు.. చెఫ్స్.. మరియు వర్కర్లు కావలెను. సంప్రదించండి.. 70999 34999, 91003 60606. [SCA25007547]

■ కొత్తగా ప్రారంభమవుతున్న ఒక ప్రతిష్టాత్మక టెక్స్‌టైల్ మరియు రెడీమేడ్ దుకాణానికి కింది పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు అవసరం:, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, క్యాషియర్, హెల్పర్లు & హౌస్ కీపింగ్ స్టాఫ్. ప్రదేశం: మినీ బైపాస్, అమ్మ ఫర్నిచర్ మాల్ ప్రక్కన, పూర్తి సమయ ఉద్యోగాలు – ఆకర్షణీయమైన జీతం మరియు ప్రోత్సాహకాలు ఇవ్వబడతాయి. టెక్స్‌టైల్ లేదా గార్మెంట్స్ రంగంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం, సంప్రదించండి. సెల్ : 87906 06068. [NA-24369]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.